www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 15 | మే | 2026 పేజీలు : 8

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించండి

-మంత్రి ఉత్తమ్‌కు సిపిఐ వినతి



2లో..



## ధాన్యం, మొక్కజొన్నను

# పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

-తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీని నియంత్రించాలి

-మొక్కజొన్నల కొనుగోళ్లలో నిబంధనలు ఎత్తివేయాలి

-రైతు సంఘం నేత బాగం

-సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, మంత్రికి వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ధాన్యం, మొక్కజొన్నను తాత్సరం చేయకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలులో ఇబ్బందులను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రోజుల తరబడి కల్లాల వద్ద రైతులు పడిగాపులు కాసిన కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం

మిగతా 2లో..

## చివరి ధాన్యం గింజ వరకు

# కొనుగోలు చేస్తాం



-తరుగు తీస్తే మిల్లర్లపై చర్యలు

-నిల్వ సామర్థ్యం పెంచేందుకు కృషి

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

-మొక్కజొన్నలపై స్పందించని ఉత్తమ్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని వీలైనంత త్వరలో కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పడుతున్న సమస్యలను అధిగమిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మిల్లర్లు రైతులను దోపిడీ చేసే క్రమంలో తరుగు తీస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, ఎంఎల్‌సి శంకర్ నాయక్ లతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 8575 కొనుగోలు కేంద్రాల

మిగతా 2లో..

## ప్రజల నుంచి

# ప్రజా ప్రభుత్వాన్ని దూరం చేయలేరు..



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ప్రజల నుంచి ప్రజా ప్రభుత్వాన్ని వేరు చేయాలేరని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 15వార్డులను కలిసి క్లస్టర్1 ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత కార్యక్రమాన్ని జయజయహే తెలంగాణ గేయంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ...

మిగతా 2లో..

- మంత్రి పొంగులేటి
- జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత ప్రారంభం
- 75వేల ఉద్యోగాలు ఇచ్చాం, నిరుద్యోగులకు తీపి కబురు
- ఏదులాపురం మున్సిపాలిటీ క్లస్టర్-1లో అట్టహాసంగా ప్రజాదర్బార్

## గోదావరి పుష్కరాలకు

# తగిన ఏర్పాట్లు చేయాలి



- మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలంలో జరిగే గోదావరి పుష్కరాలకు దేశ విదేశాల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం వసతి గృహాల్లో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుతో కలిసి పుష్కరాల ఏర్పాట్లపైసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, రోడ్లు, విద్యుత్, కరకట్ట ప్రాంతాల్లో మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని షటర్ల మరమ్మత్తులు, జనరేటర్ల ఏర్పాట్లు ఇప్పటి నుండే చేసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాల పనులు విజయవంతం చేయాలని అన్నారు. చెత్త నిర్వహణలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని, ఐటిడిఏ పిఓ, సబ్ కలెక్టర్, దేవస్థానం ఇఓ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, టూరిజం, అటవీ అధికారులు త్వరలో సమావేశాన్ని

మిగతా 2లో..

# చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తాం




**(మొదటిపేజీ తరువాయి)**

ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ఈ ఏడాది యాసంగిలో 65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 22వేల కోట్లు ప్రభుత్వం సిద్దం చేసిందని ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ప్రతి యేటా ధాన్యం కొనుగోలుకు రూ. 45వేల కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గోడౌన్ల సామర్థ్యం చాలా తక్కువగా ఉందని గోడౌన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తాలు, తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల యజమానులు రైతుల వద్ద నుండి అదనపు వసూళ్లు చేస్తే పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొంత ఇబ్బంది పెడుతుందని మద్దతు ధర ప్రకటిస్తుంది కానీ నూటికి నూరు శాతం కొనుగోలు చేయడంలో విఫలమవుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కొంత ఖర్చును భరించేందుకైనా ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడం వల్లే వరి సాగు గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించ లేదు.




**తక్షణ తరలింపుకు చర్యలు తీసుకోండి : కూనంనేని**

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నలను కాంటాలు వేసి తక్షణం తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సమీక్షా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో పది నుంచి 15 రోజుల పాటు పడిగాపులు కాసినా కొనుగోళ్లు చేయడం లేదని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆన్‌లోడింగ్ సమస్య కూడా రైతులను ఇబ్బందులు పెడుతుందని ఆయన తెలిపారు. నిల్వ చేసే గోడౌన్లు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని భవిష్యత్తులో ముందస్తు ప్రణాళికతో గోడౌన్ల నిర్మాణం లేక లీజుకు తీసుకునే ప్రయత్నం చేయాలని కూనంనేని ప్రభుత్వానికి సూచించారు. తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ పరాకాష్టకు చేరిందని క్వింటాకు 10 కేజీలు కోత విధించడం ఎక్కడ లేదన్నారు. మొక్కజొన్నల కొనుగోలు విషయంలో 26 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేయాలని ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తున్న నేపథ్యంలో 26 క్వింటాళ్ల పరిమితి ఎందుకని ఆయన ప్రశ్నించారు. నగదు చెల్లింపుల్లోనూ జాప్యం చేయవద్దని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఎస్‌పి రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్నను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు పిలుపునిచ్చారు. ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లపై మంత్రులు సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతు సంఘం ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనితో పోలీసులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు అనుమతి ఇవ్వకపోగా పలువురు రైతు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. పెద్ద సంఖ్యలో రైతులు కలెక్టరేట్ సమీపంలోకి చేరుకుని కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో నిల్వ చేయడానికి అవకాశం లేకుండాపోయిందని దీనితో పాటే గోనె సంచులు, ఇతరత్రా సమస్యలు తలెత్తుతు న్నాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా గోడౌన్లను ఎంపిక చేసి సిద్దం చేయడంలో వైఫల్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించారని వారి ద్వారా కొంత మేర మొక్కజొన్నలు విక్రయించారని మిగిలింది కొనుగోలు చేయడానికి సైతం ప్రభుత్వం సంసిద్దంగా లేకపోవడం విచారకరమని హేమంతరావు తెలిపారు. ఎకరాకు మొక్కజొన్నల కొనుగోలు విషయంలో 26 క్వింటాళ్ల నిబంధనను తక్షణం ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేసి రెండు మాసాలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని వెంటనే జమ చేయాలని అధికారులను కోరారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోళ్లను వేగవంతం చేయాల



న్నారు. ధాన్యం ఎగుమతి విషయంలో లారీల యజమానులు రైతులను ఇబ్బందులు పెడుతూ ఒక్కో బస్తాకు రూ. 20 నుంచి రూ. 80ల వరకు వసూలు చేస్తున్నారని తక్షణం అదనపు వసూళ్లను నిలిపి వేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని కోతల పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. అంతకు ముందు రైతు సంఘం నేతలు బాగం హేమంతరావు, గోవిందరావు తదితరులను పోలీసులు అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ, రైతు సంఘాల నేతలు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కె జానిమియా, ఏపూరి రవీంద్రబాబు, పగడాల మల్లేష్, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, వరదా నర్సింహారావు, దొబ్బల వెంగళరావు, బాగం మాధవరావు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి ప్రజా ప్రభుత్వాన్ని దూరం చేయలేరు

**(మొదటిపేజీ తరువాయి)**

పదేండ్లు అధికార దాహంలో పేదవాడిని విస్మరించి, నాడు రైతుల చేతులకు సంకేళ్లు వేసినవారు. నేడు రంగు రంగుల అవతారాలతో వస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నాడు అధికారంలో ఉండి వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టిన దొరవారు. నేడు రైతుల కోసం పోరాడుతన్నామంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. దోసెల్లో మొక్కలు పెట్టుకుని, కుండలకు పూతలు పూస్తూ ఫోటోలకు పోజులిస్తే ప్రజలు మోసపోరన్నారు. మీ పదేండ్ల పాలనలో అధికారులు ఏనాడూ పేదల వద్దకు రాలేదన్నారు. కానీ ఈనాడు మేమే స్వయంగా ప్రజల గడప వద్దకు వచ్చి అప్లికేషన్లు తీసుకుంటున్నామన్నారు. సొల్లు పురాణం చెప్పే ప్రభుత్వ మాదికాని చేతల ప్రభుత్వం అన్నారు. ఇప్పటికే 73వేల ఉద్యోగాలు ఇచ్చాం అని నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని శుభవార్తలు చెబుతాం అన్నారు. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేస్తే మేము ఒక్క రూపాయి అవినీతి లేకుండా రూ.5 లక్షల ఆర్థిక సాయం నేరుగా అబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నామన్నారు. జూన్ రెండవ తేదీని ఆదిలాబాద్ కేంద్రంగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. అనంతరం స్వయంగా మంత్రి అప్లికేషన్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, అదనపు సంస్థల కలెక్టర్ శ్రీజ, పలు శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఛైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, విద్యుత్‌శాఖ ఏడీ కోక్యానాయక్,ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు,మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, సిపిఐ కౌన్సిలర్లు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**



నిర్వహించుకుని గోదావరి పుష్కరాలకు కావాల్సిన ఏర్పాట్లు, కార్యచరణ రచించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సోడా ఛైర్మన్ పువ్వాడ దుర్గా ప్రసాద్, సర్పంచ్ పూనెం కృష్ణ దొర, దేవస్థానం ఇఓ దామోదర్రావు, తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లుస, ఆర్అండ్‌బి, వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. గురువారం ధాన్యం కొనుగోలుపై సమీక్షకు ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చిన సందర్భంగా శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు నేతృత్వంలో వినతి పత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. గోనె సంచుల కొరత, కాంటాల్లో జాప్యం రైతులకు శాపంగా మారిందని మంత్రికి వివరించారు. మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని క్వింటాకు ఐదు నుంచి 11కేజీల వరకు కోత విధిస్తున్నారని దీనిని తక్షణం నిరోధించాలని మంత్రిని కోరారు. మొక్కజొన్నల కొనుగోలులో సైతం ఇబ్బందులను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతుందని నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఎస్‌కె జానిమియా, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, దొబ్బల వెంగళరావు, మల్లికార్జున్, వరదా నర్సింహారావు, గోపాలరావు ఉన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్ లోని భక్త శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం మూడవ రోజు నిర్వహించిన నారాయణ సేవ (అన్నదానం) కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సండ్ర వెంకట వీరయ్యకి ఆలయ పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి శేషావస్త్రం కప్పి సత్కరించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సండ్ర వెంకట వీరయ్య భక్తులతో కలిసి నారాయణ సేవ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రాంత ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆంజనేయ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా రైతువేదిక నందు మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ వైరా మండల ఎరువులు, పురుగు మందుల డీలర్స్‌కి నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా సహాయ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, కెవికె శాస్త్రవేత్త పావని, ఫణిశ్రీ పాల్గొని దిశానిర్దేశం చేశారు. డీలర్స్ ఎవరు నకిలీ విత్తనాలను అమ్మకూడదని నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్స్‌కు శాఖాపరంగా చెప్పట్టే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు ఆయా డీలర్ ఖచ్చితంగా రైతుకు రసీదు ఇవ్వాలని, గ్రామాల్లో గుడ్డ సంచుల్లో ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా విత్తనాలు ఎరువుల అమ్మితే సంబంధిత వ్యవసాయ అధికారికి 8977748709 నెంబర్ సమాచారం ఇవ్వాలని అన్నారు. యూరియాను ఆప్ ద్వారా మాత్రమే అమ్మాలని డీలర్స్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.సైదులు, ఎం.రాజేష్, పి.వెంకటనరసయ్య, వి.కీర్తి, ఒసైటీ సీఈవోలు మండల డీలర్స్ కె.మురళి, వై.నగేష్, ఎస్.శ్రీనివాసరెడ్డి, గడిపూడి రామకృష్ణ, కృష్ణ, అప్పారావు, వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి రామకృష్ణ, పుల్లారావు,చిన్న కృష్ణ పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డిఎస్పి కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మణుగూరు సబ్ డివిజన్ పలు రాజకీయ పార్టీలు, ముస్లిం సోదరులు, హిందువు సోదరులు పాల్గొన్నారు.. సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, వెటర్నరీ డాక్టర్లు, మణుగూరు సిఐ నాగబాబు, ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి, ఎస్సై నగేష్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మణుగూరు లో ఇప్పటివరకు ప్రతి పండుగ ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నామని, అలాగే బక్రీద్ పండుగ కూడా జరుపుకోవాలని కోరుకుంటున్నామని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా గోవులు రవాణా చేస్తే పోలీస్ కు సమాచారం ఇవ్వాలని చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో హిందూ, ముస్లిం ఘటనలో వివిదా స్పధమైన అనుబంధ విషయాలపై తప్పుడు ప్రచారం చేయవద్దని, ఏ విధమైన అనుమానం వొచ్చినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజ్‌లు వొచ్చినా స్థానిక పోలీస్ కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అందరూ కలిసి మెలిసి బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని డిఎస్పి రవీందర్ రెడ్డి కోరారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి గురువారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. 49 మంది తమ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందించినట్లు ఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో వైరా నియోజక వర్గ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ పుల్లయ్య, కొప్పుల ప్రభావతి రెడ్డి, పమ్మి అశోక్, బానోత్ రామ్మూర్తి నాయక్, షేక్ మస్తాన్, కె. రాజశేఖర్, పాటి నర్సయ్య, బిక్యా నాయక్, తుములూరి లక్ష్మి నర్సింహారావు, దామ స్వరూప, గజ్జి సూర్య నారాయణ, రంగా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**కామేపల్లి మండల అధ్యక్షునిగా రాంబాబు నియామకం...**

టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆమోదంతో కాంగ్రెస్ పార్టీ కామేపల్లి మండల అధ్యక్షునిగా గుజ్జర్లపుడి రాంబాబును నియమిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. అధ్యక్ష నియామకానికి సహకరించిన టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, మంత్రులు, ఎంపిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గురుకుల పాఠశాలలో చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన గణేశ్వరం గ్రామానికి చెందిన విద్యార్థులను సన్మానించారు. గురువారం యుపిఎస్ గణేశ్వరం పాఠశాల ఆధ్వర్యంలో ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని, తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రైవేటు పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు అంటూ ప్రచారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె రఫీక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలగా మండలంలో గుర్తింపు తీసుకు రావాలన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు ఆధ్వర్యంలో గణేశ్వరం పాఠశాల నుంచి గురుకుల పాఠశాలలో చేరి అక్కడ పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బి. మేఘన 567, జె. అశ్వని 537, కె. నందిని 527, బి. శరత్ 507



మార్కులు సాధించిన వారిని ఉపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వరరావు, ఎ. విజయలక్ష్మి లు సన్మానించారు. దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన టై, బెల్ట్, వాటర్ బాటిల్స్, నోటు పుస్తకాలు, షూ, ప్లేట్లు, గ్లాసులు, ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించినట్లు గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొర్రా శ్రీను, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సేవకు మించిన తృప్తి లేదు..

**-కృషితోనే వైద్య వృత్తిలో ఉన్నత స్థితికి**
**-ప్రముఖ వైద్యులు పి. గోర్కి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మానవ జీవితంలో సేవకు మించిన తృప్తి లేదని ప్రముఖ ప్రజా వైద్యులు పారుపల్లి గోర్కి తెలిపారు. ఆది నుంచి సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ గాంధీ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న కనపర్తి మనోజ్‌కుమార్‌కు అందిస్తున్న



ఆర్థిక సహాయంలో భాగంగా రూ. 20 వేల చెక్కును గురువారం డాక్టర్ పారుపల్లి గోర్కి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా గోర్కి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనేక దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన పరిశ పుల్లయ్య తన సతీమణి పరిశ సీతారత్నం జ్ఞాపకార్థం ఎందరికో ఆర్థిక సహాయం అందించడం స్ఫూర్తిదాయకమని గోర్కి తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఆర్థిక లేమితో బాధపడుతున్న వారికి ట్రస్ట్ చేయూత నిస్తుందన్నారు. ఇంజనీరింగ్, వైద్య విద్యతో పాటు వివిధ రంగాలలో ఉన్న విద్యార్థులకు ట్రస్ట్ దోహదపడుతుందన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కనపర్తి మనోజ్ కుమార్ గాంధీ మెడికల్ కళాశాలలో నాల్గవ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తున్నాడని పుల్లయ్య తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యారంగ అభివృద్ధికి తమ సేవలు కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిటిఎ నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

**-కాకర్లపల్లి కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆగ్రహం**
**-45 రోజుల తర్వాత మంత్రుల పర్యటనలేంటి..?**
**-ప్రైవేటుకు తరలిపోతున్న వడ్లు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆగం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అదికార పార్టీ తీరుపై మండిపడ్డారు. బుధవారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు ప్రారంభమై 45 రోజుల తర్వాత ఇప్పుడు మంత్రులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కోతలకు ముందే సమీక్షలు చేసి కరోనాలోనూ ప్రతి గింజ కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లు ఆలస్యం చేయడంతో రైతులు ప్రైవేట్ మిల్లర్లను ఆశ్రయించి ఏపీ లోని మండపేట, పెద్దాపురంకు పచ్చి వడ్లు అమ్ముకుం టున్నారన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు లేక రైతులు క్వింటాకు రూ.800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలు, బస్తాలు లేక కొనుగోళ్లు ఆగిపోయాయని, రైతు భరోసా, రైతు బీమా అమలులోనూ ప్రభుత్వం



విఫలమైందని ఆరోపించారు. కేంద్రాల్లో రాజకీయ జోక్యంతో కాంగ్రెస్ నేతలు చెప్పిన వారికే కొనుగోళ్లు జరుపుతున్నారని ధ్వజమెత్తారు. సత్తుపల్లి డివిజన్‌లో భారీగా ధాన్యం ఉన్నా కొనుగోళ్లు జరగక ప్రైవేట్ మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని, వెంటనే మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు బొడ్డు శివబాబు, దొడ్డా శంకర్ రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, శ్రీరాంప్రసాద్, అమరవరపు కృష్ణారావు, వల్లభనేని పవన్, చాంద్ పాషా, బాబు,గంగారం సోసైటి అధ్యక్షుడు వెంకటరెడ్డి,అజార్, పాస్టర్ ధను, కాకర్లపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐలో పలువురి చేరిక

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలానికి చెందిన పలువురు సిపిఐలో చేరారు. గురువారం బైపాస్ రోడ్డు లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేసిఆర్ కాలనీ, చిమ్మపుడి గ్రామాలకు చెందిన నాదెండ్ల పుల్లయ్య, కుంచం నాగరాజు, గుండ్లం అశోక్ పార్టీలో చేరారు. వారికి సిపిఐ




జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి లు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# పెద్దలు పనికి.. పిల్లలు బడికి వెళ్లాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పెద్దలు పనికి పిల్లలు బడికి వెళ్లాలని వి. వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా గ్రామంలో వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి సౌకర్యాలు కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి అక్కడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య లోపంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వి. వెంకటాయపాలెం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ లోపంపై కలెక్టరేట్‌లో పలువురు యువకులు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్టి కాలనీ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న నివాసాల నుంచి గత కొన్నేళ్లుగా మురుగు



నీరు రహదారి పైకి వచ్చి నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని దీనితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సి కాలనీ మెయిన్ రోడ్డు నందు కూడా గత సంవత్సర కాలం నుండి ఒకే దగ్గర నీరు నిల్వ ఉండి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. బిసి కాలనీలో రోడ్డు పక్కన చెత్తాచెదారం ఉన్న పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనికి సంబంధించి పంచాయతీ అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా కారణాలు చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని యువకులు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# ఘనంగా బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు సందర్భంగా ఖమ్మంపాడు యుపిఎస్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో గురువారం బడిబట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులతో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణంలో పిటిఎం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం షేక్.మదార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో





చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలపై వివరించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బెల్టు, బ్యాగ్ తదితర 21రకాల వస్తువులతో కిట్‌ను అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామసర్పంచ్, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరి సమన్వయంతో పాఠశాలను అభివృద్ధిపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని, విద్యార్థులు అందరిని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపసర్పంచ్ అమరయ్యకు నివాళి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం బాలపేట గ్రామ ఉపసర్పంచ్ అమరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన దిశదిన కార్యక్రమం బాలపేట వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, బిఆర్‌ఎస్ పార్టీ మండల



నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవందర్, బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకటనర్సింహారావు, బిఆర్‌ఎస్ నాయకులు నంద్యాల పుల్లయ్య, తదితరులు హాజరై అమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లో మాకు ఎన్నో విలువైన సలహాలు, సూచనలు చేసే వారని, ఆయనలేని లోటు పూడ్చలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రేపు వైరాలో మహిళా సమాఖ్య మహాసభ

**పెద్ద ఎత్తున తరలిరావాలి : ఏపూరి లతాదేవి**

**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభ రేపు వైరాలో జరుగుతుంది. ఈ మహిళా సమాఖ్య సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కార్యదర్శి ఏపూరి లతాదేవి అన్నారు. గురువారం వైరాలో సిపిఐ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ ఈ నెల16న వైరాలో కమ్మవారి కళ్యాణ మండపం నందు జరిగే తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 22వ జిల్లా మహాసభకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ముఖ్య అతిధిగా నేదునూరి జ్యోతితో పాటు పలువురు మహిళా నాయకురాలు పాల్గొననున్నారని అన్నారు. మహిళల పట్ల నేటికి సమాజంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. వేధింపులు హత్యా యత్నాలు దాడులు కొనసాగుతూనే ఉన్నాయని మహిళల హక్కుల ఉల్లంఘన సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని,




ఈ సమావేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చర్చ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పోటు కళావతి, సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రబాబు, యామాల గోపాలరావు, గారపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రితో కలిసి దరఖాస్తులు స్వీకరించిన సిపిఐ కౌన్సిలర్ శ్రీజ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 23వ వార్డులోని టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ వార్డుకు సంబంధించిన ధరఖాస్తులను స్వీకరించారు. పలు సమస్యలపై మంత్రికి అర్జీ పెట్టుకున్న వారి సమస్యలను ఆమె



స్వయంగా విన్న వించారు. అలాగే ఆటోనగర్ టూ మద్దులపల్లిమార్కెట్ వరకు 50 అడుగులతో ఏర్పాటు చేయదలచిన రోడ్డుతో ఇండ్లు పోతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పెద్ద మనుసు చేసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. తొలుత అక్కడికి పలు సమస్యలపై వచ్చిన తన వార్డు ప్రజలకు స్వయంగా తానే అప్లికేషన్ నింపి ఇచ్చారు. ప్రజా సమస్యలపై తండ్రికి తగ్గ తనయగా శ్రీజ చూపిన చొరవకు స్థానికులు అభినందనలు తెలిపారు.

# ఎఫ్‌సిఐ గోడౌన్ ఎదుట రైతుల ఆందోళన

**- లోడ్ దింపేందుకు అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారంటూ ఆగ్రహం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌సిఐగౌడం ఎదుట మొక్కజొన్న రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఖమ్మంసూర్యపేట రాష్ట్రీయరహదారిపై ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి ధర్నా చేశారు. కాటా పేరుతో ఒక్కో వాహనానికి రూ.300వందల నుంచి రూ.500వందల వరకు మామూలు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే హమాలీల పేరుతో ఒక్కో బస్తాపై రూ.6చొప్పున దండుకుంటున్నారని దుయ్యబట్టారు. రెండు రోజుల వ్యవధిలో సుమారు 80 ట్రక్కులు ఆన్



లోడ్ అయ్యాయని, ఈ లెక్కన వివిధ పేర్లతో దాదాపు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతపరిచేందుకు చూసిన ప్పటికి వినలేదు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావాని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఆయన వచ్చి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

# ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/వైరా:** వైరా బస్టాండ్‌లో గురువారం ప్రయాణీకులకు ఎండ తీవ్రత నేపధ్యంలో రేచర్ల సైదులు, భాగ్యలక్ష్మి దంపతులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఎస్సై పుప్పాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు పాల్గొ



న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైదులు పెళ్లిరోజు సందర్భంగా ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆవరణలో ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రేచర్ల వెంకటేష్, జానయ్య, రేచర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు పరిశీలన

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో జరుగుతున్న అండర్ కేబుల్ పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలిస్తూ నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా పూర్తి



చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణ అభివృద్ధి కోసం ఇలాంటి పనులు సమర్థవంతంగా కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నకిరికంటి గోవింద్, జమిలిపాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజాస్వామిక విలువలను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్మియా, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు ఆరోపించారు. తల్లాడలో బుధవారం బండి సంజయ్ కుమారుడు భగీరథను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ టియుసిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మం, దేశం అంటూ మహిళలకు రక్షణ, గౌరవం అంటూ మాట్లాడే బిజెపి నాయకులు, మంత్రులు తమ కోసం ధర్మాన్ని, దేశాన్ని, చట్టాన్ని అవహేళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని కప్పిపుచ్చడానికి, కేసును నీరు కార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బండి భగీరథను అరెస్టు చేయకుండా తమ అధికార రాజకీయాల పట్ల అమాత్యుల పట్ల ప్రేమను లొంగుబాటును ప్రదర్శిస్తున్నారన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న డ్రగ్ మాఫియా, అత్యాచారాలపై ప్రభుత్వాలు, పోలీస్ అధికారులు ఉక్కుపాదం మోపాలని, చట్టం




ముందు అందా సమానులేనని, సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరొక పక్షపాత న్యాయం అమలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి సర్కార్ దీనిపై స్పందించి ఫోక్సో కేసు నమోదైన బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు డి.రమణ, రామకృష్ణ, రాఘవ,మురళీ, నరసరావు, కృష్ణ, సైదలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గురువారం గ్రామ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య సూచ



నల మేరకు ఎండలు అధికంగా ఉండటంతో కూలీలకు ఉపశమనం కోసం వీటిని పంపిణీ చేసినట్లు వెల్లడించారు. భానుడి ప్రతాపం ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కూలీలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయుడు శ్రీనివాసరావు, నాయుడు చిన్న అప్పారావు, చేపలచెరువు చైర్మన్ కొమ్మనబోయిన పెద్ద అప్పారావు, వేమిరెడ్డి సీతారామిరెడ్డి, పమ్మి తిరుపతిరావు, మేడి లాజర్, యువత పోలోజు ఉపేంద్ర, నెల్లూరు అనీల్, రేపాకుల మురళీ, శ్రీను, తూము సాయి, నిఖిల్, వేణు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదె మృతి

**-విరిగిన స్తంభం వైరు తగిలి దుర్మరణం**
**-రూ.50 వేల నష్టం,**
**కన్నీటి పర్యంతమైన రైతు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విద్యుత్ స్తంభం విరిగిపడి వైరు తగలడంతో గేదె విద్యుద్ఘాతానికి గురై మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిదిలోని రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన రైతు దారావత్ కృష్ణకు చెందిన సుమారు రూ.50 వేల విలువ చేసే గేదె మేతకు వెళ్ళి ఇంటికి తిరిగిరాకపోవటంతో, బుధవారం గేదె



కోసం వెతుకుతున్న క్రమంలో పంటపొలంలో గేదె మృతి చెంది కనిపించిందని, ఏం జరిగిందని పరిశీలించగా విరిగిన విద్యుత్ స్తంభం వైరు పడటంతో అక్కడికక్కడే మృతి చెందిందని రైతు కృష్ణ తెలిపాడు. సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. తన జీవనాధారమైన గేదెను పోగొట్టుకున్న రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఘటన అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రకృతి ప్రళయమా అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. పాత స్తంభాలను వెంటనే తొలగించి ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై ఏఈని వివరణ కోరగా గాలి దుమారానికి విద్యుత్ స్థంభం ఒరిగిందని దానికి గేదే రాసుకోవటం వల్లన విరిగిపడ్డి గేదే మృతి చెందిందన్నారు. రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. గత కొంతకాలంగా 9440795840 అనే నెంబర్ నుండి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తూ తాను మధిర మున్సిపల్ కమీషనర్ అని ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ప్రజలను భయభ్రాంతుకలు గురిచేస్తూ మోసపూరిత మాటలతో ఫోన్లు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు కోసం ఎటువంటి ప్రైవేట్ నెంబర్ల ద్వారా ఫోన్ కాల్స్ చేయబడవని, ఈ నెంబర్ నుండి వచ్చే కాల్స్ మున్సిపల్ కార్యాలయానికి సంబంధించింది కాదని, ఇది కేవలం ప్రజలను మోసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నం మాత్రమేనని, సైబర్ నేరగాళ్ల పట్ల మున్సిపాల్టీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్లోకాని, ప్రభుత్వం సూచించిన అధికారిక వైబ్ సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. ప్రజలు ఇటువంటి మోసపూరిత కాల్స్ నమ్మి మోసపోవద్దని కోరారు.

## ప్రజాస్వామ్య బద్ధంగా
# సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి



**- నామినేటెడ్ పాలకమండళ్ల నియామకం సరికాదు**
**- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చర్లలో రాస్తారోకో**

**ప్రజాపక్షం/చర్ల :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నామినేటెడ్ పాలకమండళ్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతీ సహకార సంఘంలో పాలకపార్టీకి చెందిన సభ్యులను అధ్యక్షులుగా, డైరక్టర్లుగా నామినేట్ చేయాలని ఉద్దేశ్యంతో రాజ్యాంగ విరుద్ధచర్యలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243జెడ్‌హెచ్ ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. సహకార సంఘంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రైతులు, కార్మికులు ఐఖ్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐకేఎస్ నాయకులు అడ్డగర్ల తాతాజీ, పోతయ్య, కోటి ముత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, చల్లా లక్ష్మీ నారాయణ, కట్టం నాగేశ్వరరావు, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, కొమరం మంగయ్య, చెన్నం సాంబశివరావు, సోడి కన్నయ్య, లక్ష్మయ్య, మడివి దేవయ్య, ప్రమీల, నాగేష్, దుర్గయ్య, రాజేష్, నర్సింహారావు, శ్రీను, రమణయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి



**వ్యవసాయ కార్మికసంఘం నాయకులు తాటి వెంకటేశ్వర్లు**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** విబిజి రామ్‌జి చట్టం రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామి పథకం ను పునరుద్దరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం నాయకులు తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో గురువారం ఉపాధిహామి పనిపథకం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధిహామి పనిపథకంలో ప్రభుత్వం నిర్ధేశించిన 100 రోజుల పని కల్పించాలనే ప్రభుత్వ సంకల్పం నీరుగారి పోతుందని అన్నారు. 202425 సంవత్సరంలో సగటున 58 పనిదినాలు కల్పిస్తే 202526లో సంవత్సరానికి సగటున 41 రోజులకు పడిపోయిందని అన్నారు. పనిప్రాంతంలో రోజుకు రెండు సార్లు ఫోటో తీసే పద్దతి తక్షణమే రద్దు చేయాలని కార్మికుల వేతనాలు పెండింగ్‌లేకుండా వారంవారం బడ్జెట్ విడుదల చేసి వేతనాలు ఇవ్వాలి అన్నారు. సంవత్సరానికి పనిదినాలు 200 రోజులకు పెంచి రోజుకూలీ రూ 600 లు ఇవ్వాలని అన్నారు. పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పనిముట్లు కూడా ప్రభుత్వమే ఇవ్వాలని, ఉపాధిహామి పథకాన్ని పట్టణప్రాంతాలకు విస్తరించి పేదలకు ఉపాధికల్పించాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న కార్మికులు భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని ప్రమాదానికి గురైన కార్మికులకు రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, మండలపార్టీ కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సిపిఐ నాయకులు పిన్నం పుల్లయ్య, బాసా వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లు, ధరల నియంత్రణే లక్ష్యంగా కదలాలి




**-నేలకొండపల్లిలో భారత మహిళా సమాఖ్య 9వ మండల మహాసభలో తాటి నిర్మల, కర్నాటి నళిని రాణి**
**-మండల కార్యదర్శిగా కర్నాటి నళిని రాణి, అధ్యక్షురాలిగా బుర్ర విజయమ్మ ఎన్నిక**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మహిళల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని భారత మహిళా సమాఖ్య పిలుపునిచ్చింది. గురువారం నేలకొండపల్లి మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం లో మారిశెట్టి విజయ దుర్గ అధ్యక్షతన మహిళా సమాఖ్య 9వ మండల మహాసభ విప్లవాత్మక వాతావరణంలో నిర్వహించారు. మహాసభను ఉద్దేశించి మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల మాట్లాడుతూ, కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ధ్వజమెత్తారు. ధరల పెరుగుదలతో సామాన్య మహిళలకు ఇల్లు గడవడం గగనమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కేవలం ప్రసంగాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో మహిళల జీవితాల్లో మార్పు రావడం లేదని విమర్శించారు. మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి నళిని రాణి మాట్లాడుతూ, అమరజీవి కర్నాటి కృష్ణయ్య చూపిన పోరాట స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలులో పాలకులు చేస్తున్న జాప్యాన్ని ఆమె ఎండగట్టారు. సమాజంలో మహిళలపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని, రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభ అనంతరం నేలకొండపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి గా కర్నాటి నళిని రాణి, అధ్యక్షురాలు గా బుర్ర విజయమ్మ, సహాయ కార్యదర్శి కుంచం రాంబాయి, ఉపాధ్యక్షులు మారిశెట్టి విజయదుర్గ, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి మమత వీరితో పాటు మరో 15 మందితో కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళా ప్రతినిధులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోసల గ్రాండ్ హోటల్ ప్రారంభించిన తుమ్మల



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని బ్రిడ్జీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కోసల గ్రాండ్ హోటల్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ మేరకు హోటల్ యజమాని చల్లగుళ్ల నాగేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి రిబ్బన్ కత్తిరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యాపార దృక్పదంతో కాకుండా ప్రజల అభిరుచుకి అనుగుణంగా సరైన సౌకర్యాలు సదుపాయాలు కల్పించి నిబద్ధతతో కూడిన వ్యాపారాన్ని సాగించాలని సూచించారు. సీతారామచంద్ర స్వామివారి సన్నిదిలో చక్కటి వ్యాపారం సాగుతుందని, వ్యాపార అభివృద్ధిలో స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు,అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, గిడ్డంగుల సంస్త చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్తంబాద్రి అర్బన్ డవలపెంట్ అథారిటి చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, భద్రాచలం, సారపాక గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు పూనెం కృష్ణ, కిషోర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి చేరుకున్న ఆయనకు పూర్ణ కుంభం, మేళ తాళాలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గర్భగుడి లోని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున వస్త్రాలు, జ్ఞాపికను అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భద్రాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని, 1986 మే 14న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు. ఆ నాటి నుండి నేటి వరకు దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రూ.350 కోట్ల ఆలయాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీరామ నవమి నాడు శంకుస్థాపన చేశారని, ఆగమ శాస్త్ర ప్రకారం పనులు జరుగుతాయని తెలిపారు. భద్రాచలం పుణ్యక్షేత్రం ప్రపంచ మేటి క్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సోడా చైర్మన్ పువ్వాడ దుర్గా ప్రసాద్, సర్పంచ్, సర్పంచ్ పూనెం కృష్ణ, తహాశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి




**ప్రజాపక్షం/కూసుమంచి:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కూసుమంచి మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి పేర్కొన్నారు. గురువారం కూసుమంచిలో ప్రభుత్వ ఒడి పిలుస్తుంది, మన పిల్లల భవిష్యత్తు కోసం ఉత్తమ ఎంపిక ప్రభుత్వ పాఠశాలలూ అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, ఈ సంవత్సరం నుంచి బ్రేక్ ఫాస్ట్ పౌష్టికాహారం కూడిన మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు మీ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చేర్పించి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం తరలింపు, చెల్లింపుల పరిస్థితులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యపై స్పందించిన ఆయన, రెండు మూడు రోజుల్లో సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, సొసైటీ చేగొమ్మ సెక్రటరీ రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్, జానీ, రవికుమార్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ రవి మృతి

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన గంగాధరణి రవీంద్ర చారి(38)వెన్నెముక సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రవీంద్ర చారి నిత్యం ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పేద కుటుంబానికి చెందిన రవీంద్ర చారి అకాల మృతితో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉంది. ఆటో నడుపుకొని జీవించే పేద కుటుంబానికి చెందిన రవి మృతి వల్ల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ నేతలు కోరారు. రవీంద్ర చారి మృతి విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేతలు వెంగళం నాగ బ్రహ్మాచారి, తుమ్మోజు రామమూర్తి, ఆటో యూనియన్ నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మృతుడు రవీంద్ర చారికి భార్య సౌజన్య, కుమారుడు సాత్విక్ ఉన్నారు.

# ఎంఎల్‌ఏ సహకారంతో కళాశాల నూతన భవనానికి నిధులు సమకూరుస్తాం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో కళాశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరుస్తుమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కశాశాల్లో వైస్‌ప్రిన్సిపల్ డా.ఎం పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన పూర్వ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కళాశాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతో పాటు కళాశాల భవనాలను విద్యార్థుల ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా తరగతి గదులుగా మార్చేందుకు కృషి చేస్తాన్నారు. యూజిసి నిధులతో నిర్మించిన భవనాన్ని బాలికల వసతి గృహంలా వినియోగించుకునేందుకు తక్షణమే అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, భద్రత దృష్ట్యా ప్రహరీ గోడను నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంగం అధ్యక్షులు సందీప్, కార్యదర్శి కాసుల వెంకట్, సిపిఓ సంజీవరావు, ప్రముఖ న్యాయవాది రబ్, రిటైర్డ్ అధ్యాపకులు డా. ప్రసన్నకుమార్, డా. ఉమా మహేశ్వరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

**-మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు**
**-వేలకోట్లతో పాలేరులో అభివృద్ధి పనులు**
**-యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందించేందుకు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా సమస్యల ద్యేయంగా ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో పాలేరు నియోజకవర్గంలోని 4 మండలాలలో ఒక్కొక్క మండలంలో మూడు సెక్టార్లుగా విభజించి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర జిల్లా మండల స్థాయి అధికారులను ఒకే వేదికపై ప్రజల వద్దకు పాలన అనే విధంగా సమస్యలను తెలుసుకొని వారి పరిష్కరించేందుకు ఎనలేని కృషి చేశారని ఆయన అన్నారు. ముఖ్యంగా పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని ఆయన తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో ఇప్పటివరకు మొదటి విడత ఇందిరమ్మ ఇల్లు 810 మంజూరు కాగా దాదాపు నిర్మాణం పూర్తిచేసుకుని ఇప్పటికీ 26 కోట్ల పైగా లబ్ధిదారుల ఖాతాలో ఇందిరమ్మ బిల్లులు నగదు జమ అయ్యాయని ఆయన తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసి నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్లను సైతం పూర్తి చేసేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు. మండల వ్యాప్తంగా 21 వేల మంది రైతులకు 17 కోట్ల రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే రెండు లక్షల లోపు ఉన్న రుణాన్ని రుణమాఫీ చేసి రైతులకు భరోసాని కల్పించిన విషయం తెలిసిందే ప్రభుత్వం రైతులు యాంత్రికరణ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు సబ్సిడీలో వ్యవసాయ యాంత్రికరణ యంత్రాలను అందిస్తుందని వివరించారు. రానున్న రోజుల్లో పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు అంతర్ జిల్లాల బీటీ రోడ్లు నూతన గ్రామపంచాయతీ బిల్డింగులు అంగన్వాడి బిల్డింగులు సైడ్ కాలువల నిర్మాణం తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషత్ ను 30 పడకల నుండి 100 పడకల ఆసుపత్రి అభివృద్ధి చేయుట సుబ్లేడ్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం ఇలా చెప్పుకుంటూ పోతే కేవలం పాలేరు నియోజకవర్గం లోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వేలకోట్ల రూపాయలు ఖర్చుతో అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే రైతులకు ఇబ్బంది లేకుండా భక్త రామదాసు నీటిని మండు ఏసవిలో సైతం వదిలి చెరువులు నింపారని అతి త్వరలో సీతారామ ప్రాజెక్టు పూర్తి అయితే పాలేరు నియోజకవర్గం మరో కోనసీమగా రూపుదిద్దుకుంటుందని ఆయన వివరించారు.

# వివోఏల వెట్టిచాకిరికి విముక్తి ఎప్పుడో..?

**-మండల కేంద్రంలో పిఒఏల వినూత్న నిరసన**
**-అంబేద్కర్ విగ్రహానికి ముందస్తు సమ్మె నోటీసు అందజేసిన వివోఏ ల జేఏసీ**
**-వివోఏ జేఏసీ మండల జిల్లా అధ్యక్షురాలు సుశీల**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** నిరంతరం గ్రామాలలో క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల అభివృద్ధికి పాటుపడుతూ పొదుపు సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి బాసటగా నిలుస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను సైతం ప్రజలకు వివరిస్తూ వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్య పాత్ర పోషిస్తున్న వివోఏల కష్టాలు అంతా ఇంతా కాదు వెంటనే ప్రభుత్వం స్పందించి వివోఏల వేతనాలను 20 వేల రూపాయలకు పెంచి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మే 18న రాష్ట్రవ్యాప్తంగా వివో ఏలు తలపెట్టిన సమ్మె నోటీసును తిరుమలాయపాలెం మండల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల విన్నుతో నిరసన వ్యక్తం చేశారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తమ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని అందించి తమ నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాదిమంది వివోఏలు ప్రభుత్వ ఒప్పంద కార్మికులుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని కనీస వేతనం అమలు చేయకుండా వారిని వెట్టి చాకిరి చేయించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలను పోషించుకుంటూ నానా కష్టాలు ఎదుర్కొంటున్నారని వివోఏలు కొందరు వృద్ధులు కూడా 30 40 ఏళ్ల నుంచి అదే ఐకెపిలో పని చేసుకుంటూ ఉంటున్నారని, వివోఏలు వృద్ధాప్యంలో ఉన్న వారికి పెన్షన్ ఇన్సూరెన్స్ పాలసీ ఉద్యోగ భద్రత నేరుగా తమ అకౌంట్లో 20 వేల రూపాయలు శాలరీ పెంచి అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పని భారాన్ని తగ్గించాలని సిసిలు చేయవలసిన పనిని వివోఏలకు అప్పగిస్తూ వారు మూడు అంకెల జీతాన్ని తీసుకుంటూ వివోఏలతో వెట్టి చాకిరి చేపిస్తున్నారని ఆరోపించారు. మే 18న జరుగు సమ్మెను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏ ల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, మండల కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా, పోలిశెట్టి అరుణ, నూకల వసంత, సామినేని కరుణ, మేకల కృష్ణవేణి, మెట్టు స్వరూప, రాణి, గోపోజి ఉపేంద్ర పద్మ, రాములమ్మ, గుగ్గిళ్ళ విజయ నాగమణి, కళ్యాణి, సువర్ణ, నీరుడు లలిత, జయ, పద్మ, మండలం లోని వివోఏలు, జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ 12లో సాయి స్ఫూర్తి డీఏవీ విద్యార్థుల అద్భుత ఫలితాలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 3వ తేదీన విడుదలైన సీబీఎస్ఈ 2026 12వ తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని బి.గంగారంలో గల సాయి స్ఫూర్తి డీఏవీ స్కూల్ విద్యార్థులు అద్వితీయ ఫలితాలు సాధించారు. పాఠశాల నుంచి మొత్తం 41 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5 మంది 80% పైగా, 12 మంది 70% పైగా, 22 మంది 60% పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తణుకు శేష సాయిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో బొన్కూరి సాయి శ్రీజ 462/500 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలవగా, ఆదిత్య సాహు 427/500, షేక్ అష్రఫ్ 342/500 మార్కులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విజేతలను సాయి స్ఫూర్తి హానరరీ చైర్మన్ డా. బండి పార్థసారథి రెడ్డి, డీఏవీ తెలంగాణ జోన్‌ఏ రీజనల్ ఆఫీసర్ జి.ఆర్.కె. ప్రసాద్, సాయి స్ఫూర్తి కాలేజ్ చైర్మన్ దాసరి ప్రభాకర్ రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టి బండి అన్విద, కళాశాల ప్రిన్సిపాల్ శేష రత్న కుమారి అభినందించారు.

# జనగణన డేటా ఆధారంగానే పథకాలు అభివృద్ధి ప్రణాళికలు



**ప్రజాపక్షం/ మధిర :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జనగణన డేటా ఆధారంగానే పథకాలు అభివృద్ధి ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందని ఎన్యూమరేటర్ డి.శ్యామరావు తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో ఎన్యూమరేట్ శ్యామరావు 34అంశాల్లో ఇళ్ల గణనలో అందులో నివసిస్తున్న యజమాని ద్వారా వివరాలు నమోదు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం చెప్పే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సేకరించిన డేటా అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, కేవలం ప్రభుత్వ ప్రణాళికల కోసమే దీనిని ఉపయోగిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం రూపొందించే సంక్షేమ పథకాలు, పాలసీలు, అభివృద్ధి ప్రణాళికలు అన్ని జనగణన ద్వారా లభించే డేటా ఆధారంగానే జరుగుతాయని, ఇళ్ల గణనలో ప్రభుత్వాలు నిర్ధేశించి 34 అంశాల్లో పూర్తి సమాచారం సేకరించటం జరుగుతుందని, దీనిని ప్రజలు అర్ధం చేసుకుని సమాచారాన్ని అందించాలని కోరారు.

# చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నల్లమోతు రమణ

**-పార్టీకి సేవ చేసిన నేతకు అధిష్టానం గుర్తింపు**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మద్దుకూరు గ్రామానికి చెందిన నల్లమోతు రమణ నియిమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని సంవత్సరాలుగా క్రియాశీలకంగా పని చేస్తూ కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగించిన రమణకు అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించింది. గతంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ సొసైటీ డైరెక్టర్‌గా పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగే నాయకత్వ లక్షణాలు ఉండటంతో అధిష్టానం ఆయనను మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నియామకంతో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా నల్లమోతు రమణ ప్రజాపక్షం విలేకరితో మాట్లాడుతూ తనను మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన అశ్వారావుపేట నియోజకవర్గ ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణకు, జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు రమణకు శుభాకాంక్షలు తెలిపారు.

# నీట్ -2026 పేపర్ లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుపై జరిగిన దాడి

**-పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్**



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** నీట్ 2026 పేపర్ లీకేజీ ఘటన కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై జరిగిన దాడి అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రుద్రంపూర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లడుతూ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్షా పత్రాలు వాట్సాప్, టెలిగ్రామ్ వేదికగా లీక్ అవ్వడం విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమాన్నరు. రాత్రింబవళ్లు కష్టపడి చదివే పేద విద్యార్థుల కలలను విద్యా మాఫియా చిద్రం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏలోని లోపాలను సవరించి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, నవీన్, మహేష్, సంతోష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.